క్లుప్తంగా

నేత్రదానంపై అవగాహన



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నగేష్‌రెడ్డి

కురుపాం: ప్రతీ ఒక్కరు నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల అవగాహనలో భాగంగా శుక్రవారం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరీరంలో ఏ అవయవానికి బాధ కలిగించినా ఆ బాధను కళ్లే వ్యక్త పరుస్తాయని, సర్వేంద్రియానాం నయనం ప్రధానం అని తెలుసుకోవాలన్నారు. ఈ నెల 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు జరుగు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. నేత్రదానం ఎలా చేయాలి.. ఎవరిని సంప్రదించాలి తదితర అంశాలపై అవగాహణ కల్పించారు. అలాగే పలువురికి నేత్ర పరీక్షలు చేసి కళ్లద్దాలకు సిఫార్స్ చేశారు.

వైఎస్సార్‌బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మి

సీతంపేట: మండలంలోని పనసమానుగూడకు చెందిన బిడ్డిక బుడ్డయ్య అనారోగ్యంతో ఈనెల 22న మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరైంది. తక్షణ సాయంగా రూ.10 వేలును మానాపురం సర్పంచ్ బి.లక్ష్మి శుక్రవారం మృతుని కుమారుడు గంగారావుకు అందజేశారు. మిగతా మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమచేస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషపై మమకారం పెంచుకోవాలి



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య

గుమ్మలక్ష్మీపురం: ప్రతి ఒక్కరూ మాతృభాషపై మమకారం కలిగి ఉండాలని గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య అన్నారు. ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కళాశాలలో ఈ నెల 23 నుంచి గిడుగు వెంకట రామమూర్తి జయంతి(తెలుగు భాషా దినోత్సవం) వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు తెలుగుభాష-సాహిత్యంపై అవగాహన కల్పించటంతో పాటు, పద్య పోటీలు నిర్వహించారు. తెలుగు భాషలోని స్పష్టత, నేర్పు, భావం, కూర్పు చాలా అందంగా ఉంటాయని, ఎందరో మహనీయులు, కవులు తెలుగు భాష ప్రాముఖ్యను చాటిచెప్పారని గుర్తుచేశారు. ప్రాశ్చాత్య దేశాలు సైతం తెలుగు భాష గొప్పతనాన్ని కీర్తించాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.త్రినాథ, శ్రీలక్ష్మి, శ్రీవాణి తదితరులున్నారు.

ఎల్‌టీఆర్ యాక్ట్ అమలు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

సీతంపేట: ఐదో షెడ్యూల్డ్ ప్రాంతం సీతంపేట ఏజెన్సీలో ఎల్‌టీఆర్ యాక్ట్ తక్షణమే అమలు చేయాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ నాయకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ ఎస్.నరసింహమూర్తికి వినతి పత్రం అందజేశారు. వన్‌ఆఫ్ సెవెంటీ చట్టానికి విరుద్ధంగా కట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే ఎవిక్షన్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. లేదంటే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ వైస్ చైర్మన్ బి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బి.ఉమామహేశ్వరరావు, ఎస్.కాంతారావు, పి.పురుషోత్తం, కె.భాస్కరరావు, ఎస్.తిరుపతిరావు, హెచ్.రవిబాబు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

సీతానగరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ అధికారి ఎస్. కరుణ రాజు కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పెదభోగిలి హడ్కో కాలనీలో విద్యుత్ కాంట్రాక్టర్ పి.రామారావు జ్ఞాపకార్థం కుమారుడు పి.నాగేశ్వరరావు నూతనంగా నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని కరుణ రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాలకు రాజ్యాంగ పరంగా హక్కులు కల్పించిన మహనీయుని విగ్రహాన్ని నాగేశ్వరరావు నెలకొల్పడం అభినందనీయమన్నారు.









సాదర స్వాగతం

ఉమ్మడి విజయనగరం జిల్లా మెంటాడ మండలం చినమేడపల్లి వద్ద కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు శంకుస్థాపన చేసేందుకు శుక్రవారం విచ్చేసిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నేతలు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన నేతల్లో పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు ఉన్నారు. – సాక్షి నెట్‌వర్క్

ఇంటింటికీ తాగునీటి కుళాయి

- వీరఘట్టంలో తాగునీటి సమస్యకు త్వరలో చెక్
- జలజీవన్ మిషన్ కింద ప్రతీ ఇంటికి కుళాయి పాయింట్ ఏర్పాటు
- ఇందుకోసం రూ.54 లక్షలు మంజూరు



ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు సిద్ధం చేసిన పైపులు

వీరఘట్టం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వీరఘట్టం మేజరుపంచాయతీ ప్రజలకు తాగునీటి కష్టాలను తీర్చేందుకు అడుగులు పడుతున్నాయి. జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.54 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. దీని కోసం కొత్త పైపులను తీసుకొచ్చారు. మరికొద్ది రోజుల్లో పనులు చేపట్టి ప్రతీ ఇంటికీ రక్షిత మంచినీరు అందించనున్నారు. ఇంటింటికీ కుళాయిలు వస్తాయని తెలియడంతో పంచాయతీ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

16 వార్డుల్లో సుమారు 5,365 కుటుంబాలు, 18500 మంది జనాభా ఉన్న వీరఘట్టం మేజర్ పంచాయతీలో ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు 320 కుళాయి పాయింట్లు, 54 చేతిపంపు బోర్లు ఉన్నాయి. అయితే నేటికీ కొన్ని వీధుల్లో కుళాయి పాయింట్లుకు సక్రమంగా నీటి సరఫరా జరగక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఈ ఇబ్బందులు తొలగించేందుకు ప్రతీ ఇంటికి జలజీవన్ మిషన్ కింద కుళాయి పాయింట్ ఇచ్చేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. ఈ మేరకు రెండు రోజులుగా ఈ పనులకు కావాల్సిన పైపులను దిగుమతి చేశారు. మరికొద్ది రోజుల్లో పనులు చేపట్టి రానున్న సంక్రాంతి లోపు ప్రతీ ఇంటికి రక్షిత మంచి నీటిని ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఉపరితల రక్షిత పైపులైన్‌తో లింకేజీ..

మండలంలోని సుమారు 31 గ్రామాలకు వండవ కొండపై ఉన్న ఉపరితల రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రస్తుతం తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పథకం పైపులైన్ ప్రస్తుతం వీరఘట్టంకు రెండు కిలోమీటర్ల దూరంలో ఎం.రాజపురం జంక్షన్ వద్ద ఉంది. అక్కడ నుంచి వీరఘట్టం పంచాయతీ కార్యాలయంలో ఉన్న 4 లక్షల క్యూసెక్కుల నీటినిల్వ సామర్థ్యం ఉన్న ట్యాంకుకు పైపులైన్ లింకేజీ చేయనున్నారు. అక్కడ నుంచి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించారు.

రూ.54 లక్షలతో పనులు

జలజీవన్ మిషన్‌లో భాగంగా రూ.54 లక్షల నిధులతో ప్రతీ ఇంటికి కుళాయి పాయింట్ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం కొత్త పైపులు వచ్చాయి. ఇంకా కొంత మెటీరియల్ రావాల్సి ఉంది. కొద్ది రోజుల్లో పనులు చేపట్టి 2023 డిసెంబరు లోపు పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

– వి.రామచంద్రరావు, ఈఓ, వీరఘట్టం మేజరుపంచాయతీ

అటవీ భూములకు రక్షణ కల్పించాలని వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మండంగి రమణ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఎల్విన్‌పేట, జేకేపాడు, ఎస్‌కేపాడు తదితర గ్రామాలకు చెందిన గిరిజనులతో కలిసి శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రగిరిలోని గురుకుల బాలుర కళాశాల సమీపంలోని ప్రభుత్వ అటవీ భూములను ప్రభుత్వం వన సంరక్షణ సమితికి అప్పగించిందన్నారు. ఆ స్థలం అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇళ్ల స్థలాల కోసం గిరిజనుల నిరసన



పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్న గిరిజనులు, సీపీఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మూడో రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టేందుకు శుక్రవారం పాదయాత్రగా వస్తుండగా.. మార్గమధ్యలో నేరేడుమానుగూడ వద్ద ఎల్విన్‌పేట పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో వారంతా రోడ్డుపై బైఠాయించి కొంతసేపు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న మాట్లాడుతూ.. భద్రగిరి గురుకుల బాలుర కళాశాలకు ఆనుకొని ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఫారెస్ట్ భూముల్లో గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఎన్నిసార్లు వినతులు అందించినా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని వాపోయారు. తమను దీక్ష చేపట్టకుండా అడ్డుకోవడం సరికాదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనులకు ఆ ఖాళీ స్థలంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ఎల్విన్‌పేట ఎస్సై షణ్ముఖరావు స్పందిస్తూ.. నిరసన దీక్షలు, ఉద్యమాలు చేపట్టేందుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని అన్నారు. ఎటువంటి అనుమతులు తీసుకోకుండా రిలే నిరాహార దీక్ష, పాదయాత్రను చేస్తున్నందున అడ్డుకున్నట్లు చెప్పారు.

రోగ నిర్ధారణ పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు



వైద్యసేవలపై ఆరా తీసున్న డీఐఓ టి.జగన్మోహనరావు

కొమరాడ: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమంతా ఉండాలని, అనారోగ్య లక్షణాలు గుర్తించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకుని సరైన చికిత్స తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని చంద్రంపేటలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. శిబిరానికి ఎంతమంది వచ్చారు, జ్వరాలతో బాధపడుతున్న వారు ఎంతమంది, వారికి అందించిన వైద్యసేవలపై ఆరాతీశారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, మలేరియా, డెంగీ తదితర వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా ఫాగింగ్ లేదా దోమల మందు స్ప్రేయింగ్ చేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సాహితి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై దిగబడిన లారీ



భామిని: మండలంలోని సతివాడ-పెద్దదిమిలి గ్రామాల మధ్య ఏబీ రోడ్డుపై భారీ లారీ దిగబడింది. ఒడిశా నుంచి వస్తున్న ఈ లారీ టైరు పేలిపోవడంతో రోడ్డు పక్కకు ఒరిగి పోయింది. పోలీసులు క్రేన్ సాయంతో లారీని బయటకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రవికుమార్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని లుంబేసు పంచాయతీ లప్పటి గ్రామంలో శుక్రవారం రాఫ ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్‌కేర్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా మధుశ్రీ హెల్త్‌కేర్(క్లినిక్) డాక్టర్ రవికుమార్ సీజనల్ వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాఫ ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.శోభన్‌బాబు, జి.పెంటయ్య ఉన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

- భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు వరలక్ష్మీ వ్రతాలు ఆచరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల పూలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. పిండి వంటలను నైవేద్యంగా పెట్టి పూజలు చేశారు. లక్ష్మీదేవికి అత్యంత ప్రీతికరమైన శ్రావణమాసంలో వచ్చే రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి ముత్తైదువులకు వాయినాలు సమర్పిస్తే సిరిసంపదలతో పాటు ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. – సాక్షి నెట్‌వర్క్



సీతంపేట: సంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



వీరఘట్టం: పూజలందుకున్న కోటదుర్గమ్మ అమ్మవారు



కొమరాడ: పరుశురాంపురం దుర్గాదేవి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



భామిని: ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి ఆశీర్వచనాలు పొందుతున్న మహిళ



వీరఘట్టం: పైడితల్లి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



భామిని: సింగిడిలో సుందరంగా అలంకరించిన లక్ష్మీదేవి పూజా మండపం



గరుగుబిల్లి: రావివలసలో అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

గ్రీన్‌అంబాసిడర్ల నిరసన



నిరసన తెలియజేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

పాలకొండ: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల (గ్రీన్ అంబాసిడర్‌ల) వేతనాలు చెల్లించాలని ఆ యూనియన్ నాయకుడు డి.రమణారావు కోరారు. శుక్రవారం గ్రీన్ అంబాసిడర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ క్లాప్‌మిత్ర కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు అందించలేనది తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వారికి వేతనాలు చెల్లిస్తున్నామని ప్రకటించారని, కానీ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. అధికారులు స్పందించి వారికి తక్షణమే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బి వరి, సీహెచ్ శంకరరావు, జి దుర్గారావు, ఎ కూర్మారావు, బి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లోనే పశువుల మందులు

సీతానగరం: గ్రామాల్లోనే పశువులకు మెరుగైన వైద్య సేవలందించడానికి అవసరమైన మందులు రైతు భరోసా కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిందని బొబ్బిలి పశుసంవర్ధక శాఖ డీడీ డాక్టర్ రెడ్డి నీలయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీతానగరం సబ్‌డివిజన్ ఏ.డి డాక్టర్ సీహెచ్‌దీనకుమార్‌తో కలిసి బొబ్బిలి డివిజన్‌లోని తుమరాడ రైతు భరోసా కేంద్రంలో మందులను తనిఖీ చేశారు. ఆర్‌బీకేలో వెటర్నరీ అసిస్టెంట్‌ను సంప్రదించి మందులు, పశువైద్య సేవలు పొందాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు సన్మానం



కొవ్వాడ చిరంజీవులను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

భామిని: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గంలో భామిని మండల నాయకులకు సముచిత స్థానం లభించిందని పార్టీ మండల నాయకులు వైస్ ఎంపీపీ బి.ధర్మారావు, ఎంపీటీసీ టింగ అన్నాజీరావు, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, సొసైటీ చైర్మన్ జి.రమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కె.ఆంజనేయులు అన్నారు. మండలానికి చెందిన కొవ్వాడ చిరంజీవులు జిల్లా పార్టీ ఉపాధ్యక్షులుగా, తోట సింహాచలం జిల్లా కార్యదర్శిగా, సోమరాజు గోపాలరావు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికవడంతో శుక్రవారం వారిని ఘనంగా సన్మానించారు. జిల్లా పార్టీ అధ్యక్షులుగా శత్రుచర్ల పరీక్షిత్‌రాజు రెండోసారి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. పార్టీ మండల నాయకులు కాగితాపల్లి కృష్ణారావు, కిల్లారి చంటి, మేడిబోయిన చలపతి, బొడ్డేపల్లి ప్రసాద్‌లున్నారు.